# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- గిరిజన ప్రాంతాలలో మెరుగైన వైద్య సదుపాయాలను కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.

- రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అన్నారు.

- శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు నీరు అందిస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ మరో పతకం దక్కించుకుంది.

- ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం లో ఆగస్ట్ 1 వ తేదీ నుండి 'జాతీయ వార్తలు' పేరిట కొత్త న్యూస్ బులెటిన్ ప్రారంభమ వుతోందని.

==========================

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారపు. ఈ రోజు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ పైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపైన దృష్టి సారించాలని అన్నారు. అలాగే, ఫీడర్ అంబులెన్స్ లను తిరిగి ప్రవేశ పెట్టడం ద్వారా రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నెలలు నిండిన గర్భిణీల కోసం గర్భిణీ వసతి గృహాలు మళ్లీ ప్రారంభించాలన్నారు. అరకు కాఫీ అమ్మకాలు, మార్కెటింగ్ పై సమగ్రమైన మార్పులు రావాలని ముఖ్యమంత్రి కోరారు. గిరిజన ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తుందని దాన్ని ఉపయోగించుకుంటే గిరిజనుల జీవితాల్లో మార్పులు తేవచ్చునని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమం లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని ఉప ముఖమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ తో యూ.ఎస్. కాన్సల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆయన నివాసంలో ఈ రోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువత ఉన్నారని తెలిపారు. వారి ప్రతిభకు తగిన అవకాశాలు అందించడంతో పాటుగా, ఉన్నత విద్యకు అమెరికా వెళ్ళేవారికీ తగిన సహకారం, మార్గనిర్దేశం అందించాలని యూ.ఎస్. కాన్సల్ జనరల్ ని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు గల అవకాశాలను ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా పోతిరెడ్డిపాడు నుంఛి ప్రతిరోజు అవసరమైన నీరును రాయలసీమకు అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో ఆయన ఈ రోజు పర్యటించారు. వరద నీరు దిగ్బంధంలో చిక్కుకున్న బాడవ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణానది నుంచి తరలివస్తున్న నీటితో శ్రీశైలంతో సహా అన్ని ప్రాజెక్టులు నిండుతున్నాయని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 22 సెకన్లు )

ఇదిలా ఉండగా నీట మునిగిన వరి పొలాలను మంత్రి పరిశీలించారు. వరద బాధితులకు ప్రభుత్వ సాయంగా 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు, కాయకూరలు అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కు మరో పతకం దక్కింది. ఈ రోజు జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీం విభాగంలో మనుబాకర్-సరబ్జోత్‌సింగ్ జోడి దక్షిణ కొరియా పై గెలుపొంది కాంస్యం సాధించారు. మనుబాకర్ జోడి 16 పాయింట్లు సాధించగా దక్షిణ కొరియా నుండి ప్రాతినిధ్యం వహించిన లీ-యెజిన్ జట్టు 10 పాయింట్లు సాధించింది. కాగా, మనుబాకర్ ఇప్పటికే వ్యక్తిగత విభాగం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్య పతకం సాధించారు. దీంతో స్వాతంత్ర్యం తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. భారత్‌కు మరో పతాకాన్ని అందించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోడి హర్షం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం లో ఆగస్ట్ 1 వ తేదీ నుండి రాత్రి 8 గంటల 30 నిమిషాలకు 'జాతీయ వార్తలు' పేరిట కొత్త న్యూస్ బులెటిన్ ప్రారంభం అవుతోందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి పెంపాటి తెలిపారు. ఈ న్యూస్ బులెటిన్ ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగంలో రెండవదిగా పేర్కొన్నారు. ఈ

బులెటిన్ రాత్రి ఎనిమిది గంటల ముప్పై నిమిషాల నుండి ఎనిమిది గంటల నలభై నిముషాల వరకూ ప్రతీ రోజూ ప్రసారం అవుతుందని తెలిపారు. ఇక సాయంత్రం ఆరు గంటల పది నిముషాల నుండి ఆరు గంటల ఇరవై నిముషాల వరకు ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తలు యధా ప్రకారం కొనసాగుతుందని వివరించారు. కాగా, ఆకాశవాణి శ్రోతలు కొత్త న్యూస్ బులెటిన్ ని కూడా ఆదరించాలని శ్రీసాయి వెంపాటి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో విద్యాపరమైన అంశాలతో పాటు నైపుణ్య సంబంధిత కోర్సులకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ తెలిపారు. ఈ రోజు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆయన పర్యటించి వివిధ విభాగాల ఉన్నతాధికారులు ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇతర విశ్వవిద్యాలయాలకు ఒక నమూనాగా తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే రెండు మూడు ఏళ్లలో NIRF ర్యాంకింగ్ లో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు మొదటి 50 లోనూ ఆతర్వాత మొదటి 20లోకు చేరాలన్నదే లక్ష్యమని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంబంధించి అందుబాటులో ఉన్న మెడ్ టెక్ జోన్ లోని రెండు ఇంక్యుబేషన్ సెంటర్లు, సెంటర్ ఫర్ మెరైన్ షిప్పింగ్, ఎస్ టి పి ఐ, నాస్కామ్ సెంటర్లను ఆయారంగాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకునే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో ఈ రోజు ప్రపంచ మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళా భద్రత కోసం కఠిన చట్టాలను అమలు చేస్తున్నామని పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో గంజాయి నిర్మూలన కోసం పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసిందని హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖపట్నంలోని పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఈ రోజు పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని కీలకమైన ఐదు జిల్లాలో గంజాయి నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. గంజాయి నివారించే విషయంలో సూచనలు సలహాల కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం నియమించిందని మంత్రి గుర్తు చేశారు. గంజాయి సాగు, ఉత్పత్తి మీద వివరాలు ఇచ్చిన వారికి బహుమతి ఇస్తామని హోమ్ మంత్రి తెలిపారు. అదే విధంగా అన్ని జిల్లాల లో కూడా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉండగా పోలీసుల సంక్షేమం మీద దృష్టి పెట్టామని, పోలీసులకు వారానికి ఒక రోజు సెలవు ఇచ్చే విషయం మీద పరిశీలిస్తామని పేర్కొన్నారు.

==========================

రాష్ట్రంలో వన్య ప్రాణులను, జంతువులను వేటాడి, అక్రమ రవాణా చేసేవారిని ఉపేక్షించవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ రాష్ట్ర అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలోని విజయపురి సౌత్ రేంజ్ అటవీ పరిధిలో వన్య ప్రాణి అలుగును వేటాడి అక్రమ రవాణా చేసే ముఠాను అదుపులోకి తీసుకొనేటప్పుడు అటవీ శాఖ ఉద్యోగులపై దాడి ఘటనపైన ఆయన ఆరా తీశారు. వన్య ప్రాణులను, అటవీ సంపదకు నష్టం కలిగించినా, అక్రమ రవాణా చేసినా, ఉద్యోగులపై దాడులు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కాగా, విజయపురి సౌత్ రేంజి అధికారులపై దాడి ఘటనపై పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోన్లో మాట్లాడారు. ఘటన పూర్వాపరాలను తెలుసుకుని ఉద్యోగులపై దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంత పరిసరాల్లోని ప్రజలకు అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు.

==========================

రాష్ట్రంలో యానాం లో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి మరియు పశ్చిమ దిశ గా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజులలో ఉత్తర కోస్తా జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే దక్షిణ కోస్తా రాయలసీమ జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షము ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

==========================

ఏలూరు జిల్లాలోని పింఛనుదారులందరికీ ఆగస్ట్ 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

==========================

ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటడం బాధ్యతగా తీసుకోవాలని చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి సి.దేవరాజు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని పాత పలమనేరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు చిత్తూరుజిల్లా విద్యాశాఖాధికారి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ చిత్తూరుజిల్లాలోని 2 వేల 349 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ పేరిట ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని చెప్పారు.

==========================

==========================